ఆంధ్రజ్యోతి, తెలుగు కళాసమితి (న్యూజెర్సీ) రాజ్యలక్ష్మి ఫౌండేషన్ వారి కథల పోటీలో సాధారణ ప్రచురణకు స్వీకరించిన కథ

# బుస

## రాంబాబు ఖశాయి

అంం దానికి నిర్వచనంగా ఆ అమ్మాయి అచ్చంగా సంపెంగలా ముక్కు-

అతని చూపు ఒళ్ళంతా పాకి-పొడుగాటి జడ చివర అందంగా మడచిన రబ్బర్ బ్యాండ్ మీద తూలిపడి- వింత పులకింత ఒక్కోసారి స్లీవ్‌లెస్ బ్లౌజ్‌లో, మరోసారి పొడుగాటి చేతుల్లో, భుజాల మీద అలవిమారిన బుట్టలతో- కళ్లు మిరుమిట్లు గొలిపే బంగారు మేని ఛాయతో- మనస్సుకు గిలిగింతలు పెడుతూ తెగ ఊరించేది.

కడకతని పెళ్లి నిశ్చయమైంది- అతని మేనమామ కూతురు తాయారుతో. "వచ్చే ఆదివారం రాత్రి పది గంటల ముప్పై రెండు నిమిషాలకు పెళ్ళి అన్నాడు తండ్రి. అతను నోరువిప్పలేదు.

అతని కలల గుర్రాలన్నీ ఆకలేసి, మేతకెళ్ళి మరి తిరిగి రాలేదు. ఉద్యోగం గురించి పెంచుకున్న అద్భుతమైన ఆశలన్నీ కుప్పకూలిపోయాయి. అదేదో డైరెక్టరేట్‌లో డిస్ట్రిక్ట్ ఆఫీస్‌లో జూనియర్ అసిస్టెంట్ ఉద్యోగం దొరికింది.

ఎవరు ఏమన్నా, అతను తలవంచుకు వెళ్ళిపోతాడు. అతని మెతకతనం చూసి- అటెండర్ పోలయ్య, టైపిస్ట్ కుముదవల్లితో సహా ఆఫీసులో పని చేసే వాళ్లంతా అతన్ని అకారణంగా అవమానిస్తారు. అసిస్టెంట్ డైరెక్టర్ అహోబిలం సరేసరి.

'యూ ఆర్ రెగ్యులర్లీ యిర్రెగ్యులర్ ఆర్ యిర్రెగ్యులర్లీ రెగ్యులర్! సవాలక్షసార్లు చెప్పాను- నీతంతు నీదే! నీకీ జన్మకు బుద్ధిరాదు! ఆఫీసు పది గంటలకన్న సంగతి గుర్తుండదా నీకు! పో! నీకివాళ ఆబ్సెంటే- పెండింగ్ ఫైల్స్ చూడు-' ఏరోజూ ఎ.డి. గర్జిస్తుంటాడు. పాపం! నెలకు పదిహేను రోజులు అటెండెన్స్ రిజిస్టర్‌లో దస్కత్ చేసే అదృష్టం అతనికి దక్కదు. అయినా ఆలస్యంగా వెళ్లి, ఎ.డి ఆగ్రహానికి గురై, ఏ రోజూ గొడ్డు చాకిరీ చేయటం అతనికలవాటు.

ఒక పెద్ద పల్లెటూరి లాంటి ఆ మున్సిపాలిటీ పరిధిలో అతనికి ఆప్త మిత్రుడెవరూ లేరు- పరిచయస్తులున్నా చిరునవ్వుతో మాట్లాడేంత సాన్నిహిత్యం లేదు. పాపం! వెంకట్రావుకు ఇల్లు కూడా పరాయి మనుషుల శిబిరం- ఎదిగిన ఇద్దరు కొడుకులు, ఏమాత్రం ఆప్యాయత ఎరగని భార్యా అతన్ని మాటల ఈటెలతో పొడుస్తుంటే, అతను కిమ్మనడు. జీతం రాళ్లు తెచ్చి భార్య చేతిలో పోస్తాడు. ఆఫీసుకు రాకపోకలు రెండు కాళ్లమీదే. ఇంక పోకెట్ మనీ- గుండుసున్న.

ఒకరోజు-

"ఏం- ఇంకా ఇల్లు జ్ఞాపకం రాలేదా మనకి-" అడిగేడు వాచ్‌మన్. చీకటిపడి చాలా సేపైనట్టుంది. ఫైళ్లన్నీ గబాగబా సర్దేసి ఆఫీసు నుంచి బయటపడుతూంటే- టైపిస్ట్ టేబిల్‌మీద పుస్తకం ఒకటి కనిపించింది. అనాలోచితంగా పేజీలు తిప్పాడు.

"నోరూవాయి లేని మొగుడికి అత్తెసరూ- చలాయించే సతికి బిరియానీ!" మంచి రుచిగా వుంది. పుస్తకం పేరు చూశాడు- "విజయానికి అడ్డదారులు" చటుక్కున తన సంచిలో వేసుకున్నాడు.

అతను మెట్లెక్కుతున్నాడు. సినిమా స్టార్‌లా అలంకరించుకున్న తాయారు పక్కింటి పడుచుతో విరగబడి నవ్వుతూ మాట్లాడుతోంది.

"మీ ఆయనొచ్చారే అక్కా!" అంది పడుచు.

"రాకేం చేస్తాడు- ఆకలైనట్టుంది-" బిగ్గరగానే.

అతను తలెత్తి అటు చూళ్లేదు. ఇల్లంతా నిశ్శబ్దంగా వుంది.

అద్దంలో ముఖం చూసుకున్నాడు- జిడ్డు పారుతోంది. ఇంటిపై కప్పంతా బూజులు. గోడ మీది బల్లి కూసింది- ఆ తర్వాతెప్పుడో వచ్చి అన్నం పెట్టింది తాయారు.

పై నుంచి చీకటి నూనెలా ధారలుగా కురుస్తోంది. దోసిలి పట్టేడు- జిడ్డు-జిడ్డు. పెద్ద గిన్నెపట్టేడు. వేల మీద నుంచి నూనె గోడలకెక్కుతోంది. బయటెక్కడో పెద్ద పిగుడుపడింది- అసిస్టెంట్ డైరెక్టర్ కళ్ళు ఎర్రగావున్నాయి. అతను పెద్ద పులిలా వున్నాడు. కుముదవల్లి, పోలయ్య, ఆఫీసుల్లో వాళ్ళంతా తనను చూసి హేళనగా నవ్వుతున్నారు. ఆ నవ్వులు ఉరుముల్లా వున్నాయి. తనకు ఊపిరి అందడం లేదు. కొడుకులిద్దరూ కాళ్లువట్టుకులాగుతున్నారు. వెనక నుంచి తాయారు తనను ముందుకు తోస్తోంది. ఇంటి ముందు నూనె వరద ప్రవాహం.

ఎదురీతలో పెద్దపాము. తన వైపే వస్తోంది. నోట్లోంచి రెండు నాలుకలు- ఒకటి ఎర్రగా, మరోటి పచ్చగా పడగ నల్లగా తోక తన పీకమీదికి విసిరింది. క్రమంగా దగ్గరకు లాక్కుంటోంది.

"అయ్యబాబోయ్!" అనరిచాడు వెంకట్రావు.

గాఢ నిద్రలోంచి మెళుకువ వచ్చేసింది. ఎంత సేపటికీ వొణుకు అణగలేదు. బాగా చెమట పట్టింది. అరిచిన గుర్తుంది. తాయారు నిద్రపోతోంది. అదే గదిలో పట్టె మంచం మీద పక్కగదిలో పిల్లలు. ఎవరికీ మెళుకువ లేదు.

అతనలాగే కూచున్నాడు. కనురెప్పలు మూతపడలేదు. లోకం తన్ను వెక్కిరిస్తోంది. ఫకాళించి నవ్వుతోంది. వెలుగులో అవమానం. చీకట్లో తన చేతకానితనం జ్ఞాపకం చేస్తో కలలు. ఇంత మెతకతనం తన నెత్తికెలా ఎక్కింది?

అతని కప్పడేం చేయాలో తోచలేదు. వేచి నిలబడ్డాడు. టేబిల్‌లైట్ క్రిందంతా వెలుగు. ఆ వెలుగులో ఆసక్తిగా అక్షరాలు.

* * * * *

బాత్‌రూంలోంచి గావుకేకలు వినిపిస్తూంటే- తాయారూ, పిల్లలూ కంగారుగా పరుగెత్తారు.

"వాటీజ్ దిస్- బాత్‌రూమ్ పరమనేస్టీగా వుంది" అవరిచాడు వెంకట్రావు. ముగ్గురూ బొమ్మలయ్యారు.

"శుచీ శుభ్రతా మరచిపోయారు" గర్జన.

"ఈ మాత్రం దానికి గావుకేకలు వేయాలా?" అని ఈసడించుకుంది ఇల్లాలు.

"షటప్- నోరెత్తితే నరికి పారేస్తాను" విరుచుకుపడ్డాడు వెంకట్రావు. "ఒకే బదుద్దాయిలారా! బాత్‌రూమే కాదు- ఇల్లెంత క్లీన్‌గా వుంచాలో తెలుసురా మీకు? శవాలాగా వేలాడుతున్నాయి బట్టలు- మురికి కంపు నువ్వు ఇల్లు కడిగి ఎంత కాలమైందే దరిద్రపు మొఖమా?" పేట్రేగిపోయాడు.

"ఇన్నాళ్ళు మీరంతా నానెత్తి మీదెక్కి డాన్సు చేశారు. ఎకసక్కెం చేశారు. ఇంక చేదురుగాని- నోరెత్తితే తాట వొలిచేస్తా- ఏమనుకుంటున్నారో-"

వెంకట్రావు విశ్వరూప ప్రదర్శన ఆ రోజుతో ప్రారంభమైంది- ఇంట్లోనే

కాదు– ఆఫీసులోను.

అటెండర్ పోలయ్య రోజూ మాదిరిగానే– 'బుద్ధావతారం ఇవాళ ఇంత పెందరాళే ఆఫీసులో దర్శనమిచ్చింది–" అన్నాడు. అంతే! వెంకట్రావు బుస్సుమన్నాడు.

"ఒరే పోలయ్యా! ఇవేళ్టి నుంచి జాగర్త! ఎవరైనా నా జోలికొచ్చారా– మీ మర్యాదదక్కదు! అరిచాడు. "ఏం చేస్తావయ్యా!" అని అంటించాడు పోలయ్య. దాంతో ఆకాశమంతెత్తు ఎగిరిపడ్డాడు.

"అసలు నేను మీకంటికెలా కనిపిస్తున్నామరా!? గాడిదల్లారా! ముసిముసి నవ్వులు– మిటకరింపులు ఇదే చెబుతున్నాను. మీ పనిఏదో మీరు చేసుకొండి– నా జోలికొచ్చారా? చీరి ఎండేస్తాను– సరిగా అప్పడే ఎ.డి నుంచి కబురు. దూసుకెళ్ళాడు వెంకట్రావు.

"చెప్పండి–ఎందుకు పిలిచారు–"

అదిరిపడ్డాడు అసిస్టెంట్ డైరెక్టర్– "ఈ వర్క్ సేంక్షన్ చేయమన్నాను కదా–' అన్నాడు నసుగుతూ.

"మీరు చేయమంటే చేసేయడమేనా– రూల్సూ టైమ్ ఏమీ లేదా! కావాలంటే మీరే డైరెక్ట్‌గా ఆర్డర్స్ వేయండి. మీరేమో తెరవెనుక వుండాలా? మేము కమిట్ అయి ఇరుక్కోవాలా? ఈ ఆఫీసులో జరుగుతున్న తతంగమంతా హెడ్డాఫీసుకు తెలియాలి–"

వెంకట్రావు గర్జనలన్నీ గదిదాటి హాలులో ప్రతిధ్వనించాయి. అతను సీట్లోకి రాగానే, అభినందించడానికి ఒక్కొక్కరూ చేరారు.

"పొండి– మీరంతా అవకాశవాదులు. బుద్ధిగా ఎవరిపని వారు చేసుకొండి!" అరిచాడు– కళ్ళురుముతూ.

"అమ్మో! వీడు పాత వెంకట్రావు కాదు–" అనుకున్నారు అసిస్టెంట్ డైరెక్టర్‌తో సహా అందరూ.

* * * * *

మాఫియా సంస్కృతి వ్యాప్తి చెందకుండా నిరోధించడానికి మద్య నిషేధం ఎత్తివేయక తప్పదట! ఏలిన వారి నిర్ణయాలకు ఏదో ఒకసాకు. ఎప్పుడెప్పుడా అని ఆంధ్రదేశం ఎదురు చూసిన శుభగడియ రానేవచ్చింది.

ఆ రోజు సాయంకాలం– ఏనాడు రుచిచూడని వెంకట్రావు బాహాటంగా ఒక బాటిల్ కొని దర్జాగా ఇంటికి తెచ్చాడు. వస్తూనే– 'కూరేంటి?' అనడిగాడు.

"పొద్దుటిదే– వంకాయ పచ్చడి' అంది తాయారు.

"వంట చేయడానికి కూడా నీకు ఒళ్ళొంగడం లేదు–"

అనరిచాడు అసహనంగా, పెద్దాడిని పిలిచి నాలుగు గుడ్లు తెమ్మన్నాడు. ఐసు ముక్కలు, సోడా తెమ్మన్నాడు. 'ఏదో డ్రింక్ కూడా తగలడు' అరిచాడు.

'ఆమ్లెట్ వేయటం వచ్చా?' భార్యనడిగాడు.

దిమ్మెరబోయి చూసింది తాయారు

"నీకెలా వస్తే అలాగే తగలడు–" అదీ గర్జనే.

అరగంట స్నానం చేశాడు. బాటిల్, గ్లాసు ముందేసుకున్నాడు. ఎందుకైనా మంచిదని తాయారు హాలు తలుపులు వేసేసింది.

"రా! నువ్వూ కొంత రుచిచూడు–' అని లాలనగా పిలిచాడు వెంకట్రావు

తాయారు మొద్దులా నిలబడింది. ఎంత మార్పు! అతను వెంకట్రావేనా!

"నీచేత్తో గ్లాసులో పోయ్!" ప్రేమగా అడిగాడు.

పిల్లిలా వుండేవాడు–పులి అయ్యాడు. వెంట్రావును చూస్తేనే– వొణుకువుదుతోందామెకు. సోడా, ఐస్‌ముక్కలు వేసుకుంటున్నాడు. ఒక్కొక్క గుక్కా గొంతులోకి జారే కొద్దీ– అతనినాలిక తడబడుతోంది.

"నేనా పుస్తకం చదవకపోతే నా బుతుకిట్లాగే కాలిపోయేది. చచ్చేంత వరకూ సర్కస్‌లో బఫూన్‌లా ఆడించేవారు– 'అంటూ కథ చెప్పడం ప్రారంభించాడు. "నారదుడు భూమ్మీదికి దిగి, తంబుర వాయించుకుంటూ, పాడుకుంటూ వెళుతున్నాట్ట. ఒక నాగుబాము చూసింది. 'నాకు ముక్తి మార్గం తెలుపు'మంది. 'కరవడం మానేయ్! అని ఉపదేశించాడు. మానేసింది. పిల్లలు దాని తోకపుచ్చుకుని ఆడుకోవటం మొదలుపెట్టేరు. చిక్కి శల్యమైంది. కొన్నాళ్లకు నారదుడు కనిపించాడు. "పిచ్చిదానా! కరవొద్దన్నాను కాని– బుసకొట్టద్దన్నానా!" అనడిగాడు. దాంతో నాగు బుస్సంది. నారదుడు బెదిరాడు. ఈ రహస్యం ఆ పుస్తకం– "విజయానికి అడ్డదారులు" చెప్పింది– నవ్వాడు వెంకట్రావు.



తాయారుకు కీలక రహస్యం తెలిసిపోయింది.

'ఇదన్నమాట. సరే చెప్తారుగా– లేవండిక మళ్ళీ ఇటువంటి వేషాలేస్తే కుదరదు– అంటూ గ్లాసూ, సీసా విసిరేసింది.

తాయారు రెక్క దొరకపుచ్చుకున్నాడు వెంకట్రావు.

పిచ్చిదానా! నారదుడు అమాయకుడు. బుసకొడితే చాలన్నాడు. నాకు తెలుసు– అరవాలో, కరవాలో! పట్టి బుసతోనే సరిపెట్టను– అవసరమైతే కాటేస్తాను అంటూ మీదికి లాక్కున్నాడు.

'ఛీ....వాసన' అని చీదరించుకుంది తాయారు.

'అసలు బాటిల్ సీలు విప్పనే లేదు సింగారీ– నేనింతసేపూ తాగింది కేవలం రంగునీళ్ళు– 'పగలబడి నవ్వేడు వెంకట్రావు

తాయారు చూసింది తాను విసిరేసింది డ్రింక్ బాటిల్. అసలు బాటిల్ సీలు చెక్కు చెదరకుండా అక్కడే వుంది.

'సాహసం లేకపోతే వాడు చాతకాని వాడేనే! ఆత్మ విశ్వాసం సంగతి మర్చిపోతే అందరూ– చక్కగా ఆడిస్తారు–'

తాయారు అతని కళ్లల్లోకి చూసింది. అతని కళ్లల్లో సరికొత్త కాంతి కదలాడడం గమనించింది.

'మందేసుకోమన్నాడా పుస్తకం రచయిత. మందు మత్తు గుండె ధైర్యం పెంచదని నాకు తెలుసు తయారూ! ఎవరికైనా ఈ రహస్యం చెప్పావో– తలపగలగొడతాను. ఇన్నాళ్ళూ లోకం నన్నాడించింది. ఇప్పుడు అందరినీ నేనాడిస్తాను. గర్జిస్తున్నా ఆ మాటలో ప్రేమరసం తొణికిసలాడుతోంది! అతని గుండెల మీద మెల్లగా తల ఆనించి, ఆనందంగా చిరునవ్వు నవ్వుకుంది తాయారు.